దేశరాజధాని ఢిల్లీలో ఈరోజు బంగారం ధర
తులం బంగారం (10 గ్రాములు)
1,39,650/- (22 క్యారెట్స్)
1,52,350/- (24 క్యారెట్స్)

## సిరా చుక్క

డిజిటల్ మాయలో
నిజమైన బంధాలు కరిగిపోతున్నాయి.
రీలు జీవితం రాజభోగంలా ఉన్నా,
రియల్ లైఫ్ అప్పుల భారంతో
నలిగిపోతోంది.
రెక్కల ముక్కలు చేసుకునే శ్రమకన్నా,
కెమెరా ముందు నటించే అబద్ధానికే
విలువ దక్కుతోంది.
లైకుల పిచ్చిలో కుటుంబ బాధ్యతలు,
పిల్లల భవిష్యత్తు మంటల్లో కలుస్తున్నాయి.
తల్లిదండ్రుల చెమట చుక్కకు లేని గుర్తింపు,
స్క్రీన్ మీద నకిలీ నవ్వుకు లభిస్తోంది.
నిజమైన కష్టం నిశ్శబ్దంగా ఏడుస్తుంటే,
ఆర్భాటపు నటన పబ్లిసిటీ పొందుతోంది.
చేతిలో పని ఉన్నవాడి కంటే,
చేతిలో ఫోన్ ఉన్నవాడే సమాజంలో
గొప్పవుతున్నాడు.
నిజాన్ని వదిలేసి, ప్రొఫైల్స్ పర్ఫెక్ట్‌గా
చూపించుకోవడమే నేటి ఏకైక లక్ష్యమైంది.
ఆత్మీయతలు, అనుబంధాలు ముగిసిపోయి,
మనుషులు కేవలం
"కంటెంట్"గా మారుతున్నారు.
సమాజం మనుషులను తీర్చిదిద్దడం మాని,
కేవలం నటించే శవాలను
తయారుచేస్తోంది.,...

– నవీన్ కుమార్ పెద్ద మాతార్..,
ప్రజా వాయిస్ మీరు దొడ్డి ....




# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 34 | ఎడిటర్: మేనం శ్యామ్ | శుక్రవారం 21-08-2026 | పేజీలు: 10


# కుమార్తె వ్యాఖ్యలపై కొండా సురేఖ క్లారిటీ..

# ‘ఆమె మాటలకు నేను బాధ్యురాలిని కాదు’!

- కుమార్తె సుస్మితా పటేల్ వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతం
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి కొండా సురేఖ లేఖ
- ‘నా కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు నేను బాధ్యత వహించాలనడం సముచితం కాదు’
- సుస్మిత వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేసిన మంత్రి
- పార్టీ నాయకత్వం, క్రమశిక్షణ నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందన్న కొండా సురేఖ
- తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీకి విజ్ఞప్తి





**ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో :** తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టత ఇచ్చారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని ఆమె లేఖలో పేర్కొన్నారు.

**‘కుమార్తె అయినంత మాత్రాన.. నేను ఎలా బాధ్యత వహిస్తా?’**

సుస్మితా పటేల్ తన వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేశారని, ఆమె తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యాఖ్యలకు రాజకీయంగా తాను బాధ్యత వహించాలనడం సముచితం కాదని కొండా సురేఖ స్పష్టం చేశారు. సుస్మిత వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఈ విషయంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని క్రమశిక్షణ కమిటీని కోరారు.

**పార్టీ క్రమశిక్షణపై పూర్తి గౌరవం!**

కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని కొండా సురేఖ లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి

మిగతా 2లో

## రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి!

### మంత్రి సురేఖ మాజీ ఓఎస్డీపై హత్యాయత్నం కేసు

- బోడుప్పల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణపై దాడి
- మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు
- తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నావంటూ ఇనుప రాడ్డుతో దాడి చేసినట్లు ఫిర్యాదు
- కాళ్లు, చేతులపై తీవ్రంగా కొట్టడంతో ఎడమ చేతికి ఫ్రాక్చర్
- ఆసుపత్రిలో శస్త్రచికిత్స
- తన అనుచరులను ఉసిగొలిపి హత్యకు ప్రయత్నించారని హరికృష్ణ ఆరోపణ
- ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు
- సుమంత్‌తో పాటు ప్రశాంత్, అరుణ్ కుమార్ రెడ్డి, కార్తీక్, మహేందర్ రెడ్డి, రాము తదితరులపై ఆరోపణలు



**ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో :** ఇప్పటికే పలు వివాదాలతో వార్తల్లో నిలిచిన మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌పై తాజాగా హత్యాయత్నం కేసు నమోదైంది. బోడుప్పల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణపై దాడి చేశారన్న ఫిర్యాదుతో పోలీసులు సుమంత్‌పై కేసు నమోదు చేశారు. తన పేరు ఉపయోగించి బయట డబ్బులు వసూలు చేస్తున్నావంటూ సుమంత్ తనపై దాడికి పాల్పడ్డాడని హరికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన హరికృష్ణ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

**‘నా పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నావ్’ అంటూ దాడి!**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమంత్ బోడుప్పల్‌కు చెందిన రియల్ ఎస్టేట్

మిగతా 2లో

## మాదాపూర్ యాక్సిడెంట్‌లో కీలక మలుపు.. ఎంపీ కుమారుడిపై కేసు!

- 26 ఏళ్ల షాపింగ్ మాల్ ఉద్యోగిని భారతి ముఖి మృతి.. కేసులో కీలక పరిణామం
- జనసేన ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు లింగమనేని సంజోష్‌ను నిందితుడిగా చేర్చిన పోలీసులు
- అతివేగంగా ఆస్టన్ మార్టిన్ కారు నడిపి యువతిని ఢీకొట్టినట్లు పోలీసుల నిర్ధారణ
- BNS సెక్షన్ 106(1) కింద సంజోష్‌పై ఎఫ్ఐఆర్ నమోదు
- ఐటీసీ కోహినూర్ వద్ద రోడ్డు దాటుతుండగా ప్రమాదం
- ఘటనాస్థలంలోనే భారతి మృతి

2 లో

## ఇబ్రహీంపట్నం డీఏఓపై ఏసీబీ పంజా

### రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తింపు!

- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏకకాలంలో 15 చోట్ల ఏసీబీ సోదాలు
- డీఏఓ శ్రీనివాస్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు
- బంధువులు, సహచరులకు చెందిన మరో 5 ప్రాంతాల్లోనూ దాడులు
- కర్మన్‌ఘాట్‌లో రూ.2.63 కోట్ల విలువైన రెండు ప్లాట్లు.. రూ.1.61 కోట్ల విలువైన జీ+3 పెంట్‌హౌస్ గుర్తింపు
- యాచారం నల్లవెల్లిలో 10 ఎకరాల 08 గుంటల వ్యవసాయ భూమి.. బాలాపూర్‌లోని బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.86 లక్షల పెట్టుబడులు
- నగదు, బంగారం, వాహనాలు, బ్యాంకు నిల్వలు సహా ఇప్పటి వరకు రూ.6.87 కోట్ల ఆస్తుల గుర్తింపు





**ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు భారీ స్థాయిలో సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో డీఏఓగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ ఏసీబీ అధికారులు ఏకకాలంలో 15 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సోదాల్లో శ్రీనివాస్‌రెడ్డి ఇల్లు, కార్యాలయంతో పాటు ఆయన బంధువులు, సహచరులకు సంబంధించిన మరో ఐదు ప్రాంతాల్లోనూ అధికారులు తనిఖీలు

మిగతా 2లో

## రైస్ మిల్లర్లపై సివిల్ సప్లయ్ కొరడా.. 20 మంది జాబితా ఈడీకి!

- ప్రభుత్వ ధాన్యం బకాయిలు చెల్లించకుండా తప్పించుకుంటున్నారన్న ఆరోపణలు
- 20 మంది మిల్లర్లపై ఫోకస్
- భారీగా బకాయిపడిన మిల్లర్ల జాబితాను ఈడీకి అందజేసిన సివిల్ సప్లయ్ శాఖ.
- ధాన్యం లావాదేవీల్లో అక్రమ నిధుల సమీకరణ, హవాలా లావాదేవీలపై అనుమానాలు
- మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర దర్యాప్తుకు ఈడీకి ఫిర్యాదు
- బకాయిలు చెల్లించని 9 మంది మిల్లర్లపై పీడీ యాక్ట్ ప్రయోగించే దిశగా పోలీసుల అడుగులు

2 లో

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై స్టే కొనసాగింపు

### .. ప్రభుత్వానికి హైకోర్టు కీలక ప్రశ్నలు!

- మధ్యంతర స్టే ఎత్తివేతకు తెలంగాణ హైకోర్టు నిరాకరణ.. సోమవారానికి తదుపరి విచారణ
- ‘నిధుల దుర్వినియోగం జరుగుతోంది..
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయి’
- కోర్టు కీలక వ్యాఖ్యలు.
- ‘ప్రజల పన్నుల డబ్బును ఉచిత పథకాలకు వినియోగించడం న్యాయమేనా?’
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ధర్మాసనం
- ఆగస్టు 19న ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో సరైన వివరాలు లేవన్న హైకోర్టు
- పథకాల చట్టబద్ధత, బడ్జెట్ కేటాయింపులపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీకి ఆదేశం

**ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై హైకోర్టు విధించిన మధ్యంతర స్టేను ఎత్తివేయడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ రెండు పథకాల చట్టబద్ధతపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిధుల దుర్వినియోగం జరుగుతోందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో సరైన వివరాలు లేవని పేర్కొన్న ధర్మాసనం.. పథకాల చట్టబద్ధత, బడ్జెట్ కేటాయింపులపై పూర్తి వివరాలతో మరోసారి కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని ఆదేశించింది.

**‘పన్నుల డబ్బును ఉచిత పథకాలకు వాడటం న్యాయమేనా?’**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు నిధులు కేటాయించడం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభావం పడుతోందని హైకోర్టు అభిప్రాయపడింది. ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా వచ్చే డబ్బును ఉచిత పథకాలకు వినియోగించడం న్యాయమేనా? అని



ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఉచిత పథకాలకు నిధులు కేటాయించడం కారణంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రయోజనాలు అందడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పెన్షన్లు, ఇతర బెనిఫిట్స్ అందక చాలామంది ఉద్యోగులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని పేర్కొంది.

**ప్రభుత్వ అఫిడవిట్‌పై అసంతృప్తి!**

ఆగస్టు 19న ప్రభుత్వం దాఖలు

మిగతా 2లో

## ఎర్రబెల్లి పాదయాత్రలో ఉద్రిక్తత

### పోలీసుల అదుపులో నుదుటికి గాయం!

- జనగామ జిల్లాలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు పాదయాత్ర ఉద్రిక్తం
- దేవరుప్పుల, కొడకండ్ల రైతులకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయాలని డిమాండ్
- సింగరాజుపల్లి వద్ద ధర్నా చేస్తున్న ఎర్రబెల్లిని అదుపులోకి తీసుకునే క్రమంలో తోపులాట
- తోపులాటలో ఎర్రబెల్లి నుదుటికి గాయం.. స్థానిక వైద్యులతో ప్రాథమిక చికిత్స
- అనంతరం దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

2 లో



# రైస్ మిల్లర్లపై సివిల్ సప్లయ్ కొరడా..

## 20 మంది జాబితా ఈడీకి!

**ప్రజా వాయిస్, బ్యూరో :** తెలంగాణలో ప్రభుత్వ ధాన్యం బకాయిలను భారీగా చెల్లించకుండా తప్పించుకుంటున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లర్లపై సివిల్ సప్లయ్ శాఖ కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి భారీ మొత్తంలో బకాయిపడిన 20 మంది రైస్ మిల్లర్ల జాబితాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి అందజేసినట్లు సమాచారం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తున్నారన్న అనుమానాలతో అధికారులు ఈ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది.

**ధాన్యం లావాదేవీల్లో అక్రమాలపై ఈడీ ఫోకస్!**

బకాయిలు చెల్లించకుండా తప్పించుకోవడంతో పాటు ధాన్యం లావాదేవీల్లో అక్రమ మార్గాల్లో నిధులు సమీకరించినట్లు, హవాలా రూపంలో డబ్బులు సంపాదించినట్లు కూడా కొందరు మిల్లర్లపై ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయా మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలు, ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్‌కు సంబంధించిన రికార్డులపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఈడీకి సివిల్ సప్లయ్ శాఖ ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

**20 మంది మిల్లర్లపై చర్యలకు రంగం సిద్ధం!**

ప్రభుత్వ ధాన్యం బకాయిల విషయంలో పలుమార్లు నోటీసులు ఇచ్చినా కొందరు మిల్లర్లు స్పందించలేదని అధికారులు గుర్తించినట్లు సమాచారం. బకాయిలను భారీగా పెండింగ్‌లో ఉంచడం, ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో 20 మంది మిల్లర్ల వ్యవహారాన్ని ఈడీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

**9 మంది మిల్లర్లపై పీడీ యాక్ట్?**

మరోవైపు బకాయిలు చెల్లించకుండా తప్పించుకుంటున్న మిల్లర్లపై పోలీస్ శాఖ కూడా కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మొత్తం 9 మంది రైస్ మిల్లర్లపై పీడీ యాక్ట్ ప్రయోగించే దిశగా అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను భారీగా పెండింగ్‌లో ఉంచడం, నోటీసులకు స్పందించకపోవడం, ఆర్థిక అక్రమాలపై అనుమానాలు ఉండటంతో ఈ చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.ప్రభుత్వ ధాన్యం బకాయిల వ్యవహారంలో సివిల్ సప్లయ్ శాఖ, ఈడీ, పోలీస్ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్తుండటంతో.. రైస్ మిల్లర్లలో తీవ్ర ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది.

# రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి!

## మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీపై హత్యాయత్నం కేసు

**మొదటి పేజీ తరువాయి**

వ్యాపారి హరికృష్ణను కలవాలని ఫోన్ చేశాడు. అయితే ఆ సమయంలో తాను అందుబాటులో లేనని, తర్వాత కలుస్తానని హరికృష్ణ చెప్పాడు. అనంతరం హరికృష్ణ స్నేహితుడు రాము కార్యాలయానికి వెళ్లగా అక్కడికి సుమంత్ కూడా వచ్చాడు. తన పేరు ఉపయోగించుకుని బయట డబ్బులు వసూలు చేస్తున్నావంటూ హరికృష్ణను సుమంత్ ప్రశ్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.తాను ఎలాంటి డబ్బులు వసూలు చేయలేదని హరికృష్ణ చెప్పినప్పటికీ.. సుమంత్ దుర్భాషలాడుతూ ఇనుప రాడ్డుతో కాళ్లు, చేతులపై దారుణంగా దాడి చేసినట్లు ఆరోపించారు. అనంతరం తన అనుచరులను ఉసిగొలిపి తనను చంపేందుకు ప్రయత్నించారని హరికృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ఎడమ చేతికి ఫ్రాక్చర్.. తీవ్ర రక్తస్రావం!**

ఈ దాడిలో హరికృష్ణ ఎడమ చేతికి ఫ్రాక్చర్ కాగా తీవ్రంగా గాయపడ్డాడు. రక్తస్రావంతో పాటు రక్తపు వాంతులు కూడా అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆగస్టు 10న హరికృష్ణ ఎడమ చేతికి శస్త్రచికిత్స జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం తనకు ప్రాణహాని ఉందని హరికృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆసుపత్రిలో చికిత్స.. ఫిర్యాదులో ఆలస్యం!**

తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కారణంగానే పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ఆలస్యమైందని హరికృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని బయటకు చెబితే ప్రాణాలు తీస్తామని తనను బెదిరించినట్లు కూడా ఆయన ఆరోపించారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్లు సమాచారం.


**జీరో ఎఫ్ఐఆర్.. జూబ్లీహిల్స్ పోలీసులకు బదిలీ!**

ఈ ఘటనపై ముందుగా మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో సుమంత్‌తో పాటు ప్రశాంత్, అరుణ్ కుమార్ రెడ్డి, కార్తీక్, మహేందర్ రెడ్డి, రాము తదితరులపై కూడా ఆరోపణలు ఉన్నాయి. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# మాదాపూర్ యాక్సిడెంట్‌లో కీలక మలుపు..

## ఎంపీ కుమారుడిపై కేసు!





**ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్ మాదాపూర్‌లో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. 26 ఏళ్ల షాపింగ్ మాల్ ఉద్యోగిని భారతి ముఖి మృతి చెందిన ఈ ప్రమాదంలో జనసేన రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కుమారుడు లింగమనేని సంజూష్‌ను నిందితుడిగా చేర్చుతూ పోలీసులు కేసు నమోదు చేశారు. అతివేగంగా కారు నడిపి భారతి ముఖిని ఢీకొట్టినట్లు దర్యాప్తులో గుర్తించిన పోలీసులు.. సంజూష్‌పై భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్ 106(1) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**రోడ్డు దాటుతుండగా ఘోర ప్రమాదం!**

మాదాపూర్‌లోని ఇన్-ఆర్బిట్ మాల్‌లో లైఫ్‌స్టైల్ స్టోర్‌లో భారతి ముఖి ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 16న మధ్యాహ్నం తన సహోద్యోగి పూజా అశోక్‌తో కలిసి ఐటీసీ కోహినూర్ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన ఆస్టన్ మార్టిన్ కారు ఆమెను ఢీకొట్టింది. దీంతో భారతికి తీవ్ర గాయాలై భారీగా రక్తస్రావం జరిగింది.

**ఆసుపత్రికి తరలించినా.. దక్కని ప్రాణం!**

ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సహోద్యోగులు భారతిని జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై బాధితురాలి మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు..**

తాజాగా పోలీసులు నిర్వహించిన విచారణలో ఆస్టన్ మార్టిన్ కారు (TG-09-G-0666)ను లింగమనేని సంజూష్ నడిపినట్లు గుర్తించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. దీంతో సంజూష్‌ను కేసులో నిందితుడిగా చేర్చి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**అన్ని కోణాల్లో దర్యాప్తు..**

ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, కారు వేగం, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

# కేపీహెచ్‌బీ హాస్టళ్లపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- యువతకు కీలక సూచనలు!
- ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన హాస్టళ్లు
- ఇప్పుడు కేపీహెచ్‌బీ, మాదాపూర్, గచ్చిబౌలి వరకు విస్తరణ
- కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 2, 3లో హాస్టళ్లపై ఏకకాలంలో పోలీసుల తనిఖీలు
- హాస్టల్ నిర్వాహకులు, యువతకు సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన
- అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు
- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని.. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశం

**ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్‌లో హాస్టళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఒకప్పుడు అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ వంటి కొన్ని ప్రాంతాలకే పరిమితమైన హాస్టళ్లు.. ప్రస్తుతం కేపీహెచ్‌బీ, మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లోనూ భారీగా విస్తరించాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో హాస్టళ్ల నిర్వహణ, యువత భద్రతపై స్థానికుల నుంచి ఫిర్యాదులు కూడా వచ్చిన సందర్భాలు ఉన్నాయి.

**కేపీహెచ్‌బీలో ఏకకాలంలో తనిఖీలు!**

ఈ నేపథ్యంలో కేపీహెచ్‌బీలో పోలీసులు హాస్టళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం ఆగస్టు 20న కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 2, 3లోని పలు హాస్టళ్లలో పోలీసులు ఏకకాలంలో తనిఖీలు



చేపట్టారు. హాస్టల్ నిర్వాహకులు, అక్కడ ఉంటున్న యువతతో మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి!**

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఇతర రహస్య సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.

**డ్రగ్స్‌కు దూరంగా ఉండండి..**

యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. హాస్టళ్లలో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. హాస్టల్ నిర్వాహకులు కూడా తమ పరిధిలో అనుమానాస్పద పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

**హాస్టళ్లపై పోలీసుల నిఘా!**

కేపీహెచ్‌బీలో హాస్టళ్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. యువత భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టే దిశగా ఇలాంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగించే అవకాశం ఉంది.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై స్టే కొనసాగింపు

## .. ప్రభుత్వానికి హైకోర్టు కీలక ప్రశ్నలు!

**మొదటి పేజీ తరువాయి**

చేసిన అఫిడవిట్‌ను పరిశీలించిన హైకోర్టు.. అందులో సరైన వివరాలు లేవని స్పష్టం చేసింది. పథకాల కోసం ఎంత నిధులు కేటాయిస్తున్నారు? బడ్జెట్‌పై వాటి ప్రభావం ఎంత? పథకాల చట్టబద్ధతకు సంబంధించిన అంశాలపై పూర్తి వివరాలు సమర్పించాలని ఏఏజీని ఆదేశించింది. సరైన వివరాలతో సమగ్ర కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది.

**భూసేకరణ బాధితులపైనా ప్రభుత్వానికి చురకలు!**

భూసేకరణలో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరిహారం కోసం బాధితులు సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని వ్యాఖ్యానించింది. ఒకవైపు ఉచిత పథకాలకు నిధులు కేటాయిస్తూనే.. మరోవైపు భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందకపోవడంపై కోర్టు ప్రశ్నలు సంధించింది.

**2014లో ప్రారంభమైన పథకాలు.. రూ.1,00,116 ఆర్థిక సాయం!**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో ప్రారంభించింది. ఈ పథకాల కింద అర్హులైన వధువులకు రూ.1,00,116 ఆర్థిక సాయం అందుతోంది. వధువుకు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండాలనే నిబంధనతో బాల్య వివాహాలను తగ్గించవచ్చని అప్పటి ప్రభుత్వం భావించింది.

**సోమవారానికి విచారణ వాయిదా!**

ఈ రెండు పథకాల చట్టబద్ధత, బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన వివరణ కావాలని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఆగస్టు 13న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై హైకోర్టు మధ్యంతర స్టే విధించిన విషయం తెలిసిందే.

# కుమార్తె వ్యాఖ్యలపై కొండా సురేఖ క్లారిటీ..

## 'ఆమె మాటలకు నేను బాధ్యురాలిని కాదు'!

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీని కోరారు.

**పరకాల నుంచి పోటీ చేస్తానన్న సుస్మిత!**

వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని వెల్లడించారు. ఇదే సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

**వైరల్‌గా మారిన వ్యాఖ్యలు.. కాంగ్రెస్‌లో కలకలం!**

సుస్మితా పటేల్ వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరారు. మరోవైపు క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందిస్తూ.. మంత్రి కొండా సురేఖను వివరణ కోరుతామని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే మంత్రి తాజాగా క్రమశిక్షణ కమిటీకి లేఖ రాసి తన వైఖరిని స్పష్టం చేశారు.

# ఎర్రబెల్లి పాదయాత్రలో ఉద్రిక్తత

## పోలీసుల అదుపులో నుదుటికి గాయం!

**ప్రజా వాయిస్, జనగామ బ్యూరో :** జనగామ జిల్లాలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు చేపట్టిన పాదయాత్ర తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దేవరుప్పుల, కొడకండ్ల మండలాల రైతులకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎర్రబెల్లి పాదయాత్ర చేపట్టారు. రైతుల సాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఆయన ఆందోళనకు దిగారు.

**ఎర్రబెల్లిని అదుపులోకి తీసుకునే క్రమంలో తోపులాట!**

పాదయాత్రలో భాగంగా సింగరాజుపల్లి గ్రామం వద్ద ఎర్రబెల్లి దయాకర్ రావు ధర్నాకు దిగారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.

**తోపులాటలో నుదుటికి గాయం!**

పోలీసులు ఎర్రబెల్లిని అదుపులోకి తీసుకునే



సమయంలో జరిగిన తోపులాటలో ఆయన నుదుటిపై గాయాలయ్యాయి. వెంటనే స్థానిక వైద్యులను పిలిపించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పోలీసులు ఎర్రబెల్లి దయాకర్ రావును దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**సాగునీటి కోసం పోరాటం.. ఉద్రిక్తంగా మారిన పాదయాత్ర!**

ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్న నేపథ్యంలోనే ఈ ఆందోళన చేపట్టినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. రైతుల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు ఎర్రబెల్లి పాదయాత్ర, పోలీసుల అదుపులోకి తీసుకోవడం, తోపులాటతో జనగామ జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

# ఇబ్రహీంపట్నం డీఏఓపై ఏసీబీ పంజా

## రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తింపు!

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా ఆస్తుల పత్రాలను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది.

**కర్మన్‌ఘాట్ నుంచి యాచారం వరకు.. భారీగా ఆస్తులు!**

ఏసీబీ సోదాల్లో శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన పలు స్థిరాస్తులు వెలుగులోకి వచ్చాయి. కర్మన్‌ఘాట్‌లో రూ.2.63 కోట్ల విలువైన రెండు ప్లాట్లతో పాటు రూ.1.61 కోట్ల విలువైన జీ+3 పెంట్‌హౌస్‌ను అధికారులు గుర్తించారు. యాచారం నల్లవెల్లిలో 10 ఎకరాల 08 గుంటల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేలింది. అలాగే నగర పరిధి, శివార్లలో 8 ఖాళీ స్థలాలను గుర్తించారు. బాలాపూర్‌లోని నరేంద్ర బార్ అండ్ రెస్టారెంట్‌లో శ్రీనివాస్‌రెడ్డికి పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ పెట్టుబడుల్లో ఆయన వాటా విలువ రూ.86 లక్షలుగా ఉన్నట్లు ఏసీబీ తెలిపింది.

**నగదు, బంగారం, కార్లు కూడా..**

సోదాల్లో రూ.4 లక్షల నగదుతో పాటు బ్యాంకు ఖాతాల్లో రూ.8.60 లక్షల నిల్వలను అధికారులు గుర్తించారు. 680 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు కూడా గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.59 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు కూడా సోదాల్లో బయటపడ్డాయి. అంతేకాకుండా బ్యాంకులో 46 తులాల బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

**ఇప్పటివరకు రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తింపు!**

శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ఆస్తులు భారీగా ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు జరిగిన సోదాల్లో మొత్తం రూ.6.87 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు తెలిపారు. అయితే ఆయనకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీంతో ఈ కేసులో మరిన్ని ఆస్తులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

**2009లోనే కేసు.. ఇప్పుడు మళ్లీ ఏసీబీ పంజా!**

శ్రీనివాస్‌రెడ్డిపై గతంలోనే ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైనట్లు ఏసీబీ వెల్లడించింది. 2009లో ఆయనపై ఈ తరహా కేసు నమోదైనట్లు అధికారులు తెలిపారు. తాజాగా మరోసారి ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ దాడులు నిర్వహించడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**శ్రీనివాస్‌రెడ్డి అరెస్ట్.. కోర్టులో హాజరు!**

సోదాల అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆయనను జ్యుడిషియల్ రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. సోదాల్లో లభించిన ఆస్తుల పత్రాలు, నగదు, బంగారం, పెట్టుబడులకు సంబంధించిన వివరాల ఆధారంగా కేసు దర్యాప్తును మరింత లోతుగా కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.

# సహజీవనంపై ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు

## .. మేజర్లకు కుటుంబం అడ్డంకి కాదు!

- ఇద్దరు మేజర్లు సహజీవనం చేస్తే తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు జోక్యం చేసుకోలేరన్న ఢిల్లీ హైకోర్టు
- లివ్-ఇన్ జంటకు పోలీసుల రక్షణ కల్పించవచ్చని స్పష్టం
- తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ మేజర్లకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు
- కులం, మతం, జాతి, విశ్వాసం పేరుతో వ్యక్తిగత స్వేచ్ఛను పరిమితం చేయలేమన్న కోర్టు
- బెదిరింపులు ఎదుర్కొంటున్న జంటకు పోలీస్ ప్రొటెక్షన్ కల్పిస్తూ కీలక వ్యాఖ్యలు

**ప్రజా వాయిస్, ఢిల్లీ బ్యూరో :** సహజీవనంపై ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఇద్దరు మేజర్లు పరస్పర అంగీకారంతో సహజీవనం చేస్తున్నప్పుడు వారి వ్యక్తిగత జీవితంలో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, స్నేహితులు జోక్యం చేసుకునే హక్కు లేదని స్పష్టం చేసింది. తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొంది. సహజీవనం చేస్తున్న జంటకు బెదిరింపులు ఎదురైతే పోలీసుల రక్షణ కూడా కల్పించాలని కోర్టు స్పష్టం చేసింది.

**'మేజర్ల వ్యక్తిగత స్వేచ్ఛను అడ్డుకోలేరు!'**

ఇద్దరు మేజర్లు పరస్పర అంగీకారంతో కలిసి జీవించాలని నిర్ణయించుకుంటే.. వారి నిర్ణయంలో కుటుంబసభ్యులు జోక్యం చేసుకోలేరని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. వ్యక్తి తన జీవిత భాగస్వామిని ఎంచుకోవడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులో భాగమని స్పష్టం చేసింది. సామాజిక నైతికత పేరుతో వ్యక్తిగత స్వేచ్ఛను హరించేందుకు ఎవరికీ హక్కు లేదని వ్యాఖ్యానించింది.

**కులం, మతం పేరుతో అడ్డంకులు వద్దు!**

కులం, మతం, జాతి, విశ్వాసం వంటి అంశాలతో సంబంధం లేకుండా మేజర్ల వ్యక్తిగత నిర్ణయాలను గౌరవించాలని కోర్టు స్పష్టం చేసింది. సామాజిక నైతిక విలువలను ప్రస్తావిస్తూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను పరిమితం చేయడం వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని పేర్కొంది. వివాహం లేదా సహజీవనం విషయంలో వ్యక్తుల స్వేచ్ఛకు రాజ్యాంగ పరిరక్షణ ఉంటుందని తెలిపింది.




**బెదిరింపుల నేపథ్యంలో పోలీస్ ప్రొటెక్షన్!**

యువతి కుటుంబం నుంచి బెదిరింపులు ఎదురవుతున్నాయంటూ ఓ జంట కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సౌరభ్ బెనర్జీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. జంటకు పోలీస్ ప్రొటెక్షన్ కల్పించాలని ఆదేశించారు. మేజర్లు తమకు నచ్చిన వ్యక్తితో కలిసి జీవించాలనే నిర్ణయం తీసుకుంటే.. కుటుంబం లేదా సమాజం నుంచి ఎదురయ్యే బెదిరింపుల కారణంగా వారి స్వేచ్ఛకు భంగం కలగకూడదని కోర్టు స్పష్టం చేసింది.

**వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగ రక్షణ!**

మేజర్ల వ్యక్తిగత నిర్ణయాలను సామాజిక నైతిక విలువలతో ముడిపెట్టి అడ్డుకోవడం సరికాదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛ, జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు వంటి రాజ్యాంగ హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ వ్యవస్థలపై ఉందని కోర్టు వ్యాఖ్యానించింది.



## బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు చందన
- భూషనరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు

**ప్రజా వాయిస్, కథలాపూర్:** బాల్య వివాహాలనే సామాజిక జాడ్యాన్ని రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు చందనపిలుపునిచ్చారు. మండల పరిధిలోని భూషనరావుపేట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి నిర్వహించిన అవగాహనసదస్సులో ఆమె మాట్లాడారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహాలు చేయడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, ఉన్నత విద్యకు దూరమై భవిష్యత్తు అంధకారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామస్థాయిలో ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్, మండలవిద్యాధికారి, స్థానిక ఎస్ఐ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు..?

- రామగుండం లో యథేచ్ఛగా బ్లాక్ పెట్రోల్ దందా
- నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు
- డబ్బాలు, సీసాల్లో బహిరంగంగా అమ్మకాలు
- ఏళ్లుగా చోద్యం చూస్తున్న అధికారులు

**ప్రజా వాయిస్, గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్దంగా పెట్రోల్ అమ్మకాలు జరుగుతున్నాయి.ఏ గల్లీ చూసినా పాల ప్యాకెట్ దొరికినంత సులభంగా బ్లాక్ లో పెట్రోల్ దొరుకుతుంది.కొందరు చిరు వ్యాపారులు, కిరాణా దుకాణా దారులు నిబంధనలు బేఖాతరు చేస్తూ లీటర్ పెట్రోల్ పై పది నుంచి పదిహేను రూపాయలు అదనంగా తీసుకుంటూ అమ్మకాలు చేపడుతున్నారు.పెట్రోలియం శాఖా నిబంధనల ప్రకారం గ్రామాల్లో పట్టణాల్లో లూస్ పెట్రోల్ విక్రయించడం నేరం అని తెలిసినా కొందరు పెట్రోల్ ను కల్తీ చేస్తూ వాహనదారుల నుంచి అదనంగా దోచుకుంటున్నారు.

**పెట్రోల్ అమ్మకాలు,నిబంధనలు :**

పెట్రోల్ ను అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిల్వ ఉంచడం,డబ్బాలు, సీసాల్లో విక్రయించడం నేరం.పెట్రోలియం శాఖా నిబంధనల ప్రకారం పెట్రోల్ ను బంకులు నేరుగా వాహనాల్లోనే నింపాలి.

**పెట్రోల్ బంకుల పాత్ర :**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ ను బంకుల ద్వారా క్యాన్లలో లేదా డబ్బాల్లో పెట్రోల్ విక్రయించడం నేరం.కానీ, బంకు సిబ్బంది నిబంధనలను ఉల్లంఘించి దళారులకు ఇష్టానుసారంగా పెట్రోల్ పోసి అక్రమ రవాణాకు దోహదపడుతున్నారు.పెట్రోల్ బ్లాక్ మార్కెట్ దందాకు కొందరు బంకు యజమానులు ప్రత్యక్షంగా,పరోక్షంగా సహకరిస్తున్నారు.

**ప్రమాదాలు సంభవించే అవకాశం :**

నిబంధనలకు విరుద్ధంగా క్యాన్ లలో బాటిల్స్ లలో పెట్రోల్ నిల్వ ఉంచడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఇరుకు వాడలు ,సందులు అనేకం ఉన్నాయి. కనీసం ఫైర్ ఇంజిన్ రాని పరిస్థిలో చాలా కాలనీలు ఉన్నాయి.ఇలాంటి ప్రాంతాల్లో పెట్రోల్ విక్రయాల వల్ల పెద్ద ప్రమాదం జరిగి ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి.అలానే గతంలో జరిగిన సంఘటనల లాగా అసాంఘిక కార్యాలపాలు జరిగే అవకాశం ఉంది.

**చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి :**

పెట్రోలియం శాఖా నిబంధనలకు విరుద్ధంగా డబ్బాలు , బాటిల్స్ లో పెట్రోల్ అమ్మకాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునే అవసరం ఉంది.అసలే ఇరుకు కాలనీలకు నిలయమైన గోదావరిఖనిలో చిరు వ్యాపారులు అని, కొంత మొత్తమే కదా అని ఉదాసీనత వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. పెట్రోల్ అమ్మే వాళ్లకే కాక చుట్టూ పక్కల వాళ్లకు కూడా ఆస్తి,ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. వెంటనే సంబంధిత అధికారులు నియోజక వర్గం మొత్తం స్పెషల్ డ్రైవ్ పెట్టి పెట్రోల్ దందాకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.






## నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులివ్వండి

- ఏడు రోజుల సమయం ఇచ్చి పూర్తి చేయాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు
- సమగ్ర సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటరు జాబితా, మండలాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ వివరాలు, నోటీసులు జారీ చేసి చెక్ చేయాలనీ,7 రోజులు టైమిచ్చి పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా నో మ్యాపింగ్, అనమలిస్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎ.ఈ.ఆర్.ఓ. లను కేటాయించి, వారికి కొత్త లాగిన్లు ఏర్పాటు చేసి, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని,నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు , సమగ్ర సర్వే లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఎం పి డి ఓ లు, తహసీల్దార్ లు సమన్వయంతో పని చేసి నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను నిర్ణత సమయం లో పూర్తి చేయాలనీ,గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణలత, ఆర్ డి ఓ వాసు చంద్ర,సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 53 వేల ఎకరాలకు జలసిరి

- ముక్త్యాల లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై మంత్రి ఉత్తమ్ ఫోకస్

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్**, ఆగష్టు 20హుజూర్ నగర్ నియోజకవర్గం చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద 1648 కోట్ల రూపాయలతో 53000 ఎకరాలకు నీరు అందించే మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను గురువారం రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా మంత్రి అండర్ గ్రౌండ్ నందు పంపు హౌస్ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా నది మీద నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మొత్తం ఖర్చు 1,648 కోట్లు కాగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ 16 మెగా వాట్ల 4 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయడం ద్వారా మట్టంపల్లి మండలంలో 9 గ్రామాలలో 20,466 ఎకరాలకు, మేళ్లచెరువు మండలంలో 5 గ్రామాలలో 15,829 ఎకరాలకు, చింతలపాలెం మండలంలో 9 గ్రామాలలో 16705 ఎకరాలకు మొత్తం 53000 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని దీని ద్వారా 5,080 ఎస్ టి , 3540 ఎస్ సి, 8470 బి సి, 2205 ఓ సి కుటుంబాలు మొత్తంగా 19,295 కుటుంబాలు లబ్ధి పొందుతాయని దీని కొరకు 191 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి వారికి నష్టపరిహారంగా 60 కోట్లు చెల్లించడం జరిగినదని నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకుని ఈ ప్రాంతంలోని గ్రామాలను సస్యశ్యామలం చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికీ ప్రాజెక్టు రూఫ్ టాప్ లెవెల్, పంప్ హౌస్ పనులు పూర్తి అవుతాయని వీలైనంత తొందరగా ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని మంత్రి గుత్తందారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## గోమోర్ పై చర్యలు శూన్యమైన!

- మందు కొట్టారు పంట కొట్టుకుపోయింది పై స్పందన!
- పంట పరిశీలన చేసి చర్యలు ఎందుకు తీసుకోలేదు తెలియని పరిస్థితి
- రైతన్న నష్టాన్ని భర్తీ చేసేది గో మోర్ కంపెనీ యాజమాన్య నా!
- పంట నాశనం కాలేదు మంచిగానే ఉందని వత్తాసు పలకడం వెనక కారణమేంటి!?
- వచ్చారు. చూశారు. వెళ్లారు. ఫలితం శూన్యమేనా!?
- ఏ దిశలోనైనా మట్టి పూలేనా నష్టపోయేది అంటూ రైతు సంఘాలు ఆగ్రహం!





**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** అశ్వారావుపేట నియోజకవర్గం లోని అన్నపరెడ్డి పల్లి పట్టణంలోని మా గోమోర్ కంపెనీ నందు ఈనెల మూడో తారీకు ఇరువురు రైతులు సుమారు ఎనిమిది వేల రూపాయల ఎరువులను ఎనిమిది ఎకరాల వరి పంటలో గడ్డి నివారణ ప్రక్రియలో భాగంగా ద్రావణాన్ని పిచికారి చేయటంతో కలుపు నివారణ కాకపోగా పంట పాడైపోయిన సంఘటనపై ప్రజా వాయిస్ దినపత్రిక★ మందు కొట్టారు పంట కొట్టుకుపోయింది★ అనే కథనాన్ని వెల్లడించడంతో స్పందించిన మండల అగ్రికల్చర్ అధికారి అనూష గురువారం సంఘటన స్థలానికి చేరుకొని పైరను పరిశీలన చేసి మందులు మా గోమోర్ కంపెనీ నందు కొనుగోలు చేసిన సందర్భం నిజమేనని దానిని పంట చేనుకు వినియోగించడం వాస్తవమేనని తదుపరి ఎక్కువ మోతాదులో వాడకం వల్ల పైరు దెబ్బతిన్న మాట వాస్తవమేనని నివారణ చర్యంగాను రైతులు మరల కొంత ఫెర్టిలైజర్స్ ఎరువులను ఉపయోగించటం దానివల్ల పంట కొంత మెరుగుగా అభివృద్ధి చెందిందని చెప్పటం రైతు కంట కన్నీళ్లు తుడిచినంత నిదానంగా ఉందని ప్రైవేట్ కంపెనీ నందు అవగాహన లేని వ్యక్తుల ద్వారా ఫెర్టిలైజర్స్ ఎరువులను విక్రయాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకో పోగా కేవలం రైతులను ఓదార్చడం కి వచ్చినట్లు వచ్చారని రైతన్నలు భారీగా విమర్శిస్తున్నారు. మట్టి పూలకు జరుగుతున్న అన్యాయాన్ని సమర్థిస్తున్నారా? లేక ప్రైవేటు కంపెనీ యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారో! తెలియక తికమక పడుతున్నారని మాగోమోర్ కంపెనీ పై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు భారీగా అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## పదవి భార్యధి- పెత్తనం భర్తధి

- త్రిపురవరంలో మహిళా రిజర్వేషన్‌కు తూట్లు
- సర్పంచ్ భర్త పెత్తనం, భర్త పాలనపై గ్రామంలో చర్చ
- ప్రభుత్వ కార్యక్రమాల్లో భర్త దౌర్జన్యం
- అధికారుల మౌనం, గ్రామస్తుల్లో ఆగ్రహం



**ప్రజా వాయిస్,అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని త్రిపురవరం గ్రామపంచాయతీలో మహిళా రిజర్వేషన్ పేరుకే పరిమితమైంది. సర్పంచ్‌గా ఎన్నికైన మహిళ నామమాత్రమే, అసలు పాలన మొత్తం ఆమె భర్త చేతిలో ఉందని గ్రామస్తులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.గ్రామపంచాయతీ కార్యాల యం నుండి ప్రభుత్వ కార్యక్రమాల వరకు ప్రతి చోటా సర్పంచ్ భర్తే పెత్తనం చెలాయిస్తున్నాడు. గతంలో త్రిపురవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ హోదాలో ఆయనే స్వయంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆ సమయంలో కొందరు ఉపాధ్యాయులు సహకరించడంతో అతని పెత్తనం మరింత పెరిగిందని గ్రామస్తులు అంటున్నారు. తాజాగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో జరిగిన పర్యవేక్షణ కమిటీ సమావేశంలో సర్పంచ్ చైర్మన్ స్థానంలో అతనే కూర్చున్నాడు. కమిటీ సభ్యులుగా ఉన్న మహిళలను పక్కన పెట్టి తానే అన్ని నిర్ణయాలు తీసుకుంటూ, పిల్లలకు ఇచ్చే ఆహారం గురించి కాకుండా తన అధికారాన్ని ప్రదర్శించుకున్నాడు.గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగే ప్రతి వ్యవహారంలోనూ అతని జోక్యం ఉంటోంది. అధికారులు అడ్డుకోవాల్సి ఉండగా మౌనంగా ఉండటం, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.పదవి భార్యది పాలన భర్తది అనే విధానానికి త్రిపురవరంలో అడ్డుకట్ట పడాలి. ఓటు వేసింది భార్యకు, పని చేస్తున్నది భర్త అయితే మహిళా రిజర్వేషన్‌కు అర్థం ఏముంటుంది? ఇది ప్రజాస్వామ్యానికి, మహిళల హక్కులకు చేస్తున్న అవమానం" అని గ్రామ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సర్పంచ్ భర్త ఇకపై ఏ ప్రభుత్వ కార్యక్రమంలోనూ జోక్యం చేసుకోకుండా కఠిన ఆదేశాలు జారీ చేయాలని, నిబంధనలను ఉల్లంఘించి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# రైస్ మిల్లు చూస్తే అగ్గిపెట్టె అంత బకాయిలు మాత్రం రూ. 10 కోట్లా?

- కాగితాల్లోనే మిల్లింగ్.. పక్కదారి పట్టిన బియ్యం
- భవనం కాదు... అది కేవలం రేకుల షెడ్డు!
- కేటాయించిన ధాన్యం ఎటుపోయింది?
- సొమ్ము ఎవరి అకౌంట్లలో పడింది?
- సమగ్ర ఉన్నత స్థాయి విచారణకు మంథని ప్రజల డిమాండ్



**ప్రజా వాయిస్ మంథని** చూడటానికి ఒక చిన్న అగ్గిపెట్టె పరిమాణంలో, సరైన వసతులు లేక కేవలం రేకుల షెడ్డులా దర్శనమిస్తున్న ఆ రైస్ మిల్లుకు ప్రభుత్వం కోట్ల రూపాయల విలువైన ధాన్యం ఎలా కేటాయించిందనేది ఇప్పుడు మంథనిలో తీవ్ర కలకలం రేపుతోంది. మంథనిలోని పవనసుతా రైస్ మిల్లు' పేరు మీద దాదాపు రూ. 10 కోట్ల విలువైన కస్టమ్ మిల్లింగ్ రైస్ (CMR) బకాయిలు ఉన్నట్లు అధికారులు గుర్తించిన వ్యవహారం స్థానికంగా సంచలనంగా మారింది. అసలు ఆ మిల్లు సామర్థ్యం ఎంత? అక్కడ ధాన్యం నిల్వ ఉంచేందుకు ఉన్న స్థలం ఎంత? అనే ప్రాథమిక విషయాలను కూడా తనిఖీ చేయకుండా పౌర సరఫరాల శాఖ అధికారులు కోట్ల విలువైన ధాన్యాన్ని ఆ రేకుల షెడ్డు మిల్లుకు ఏ ప్రాతిపదికన కేటాయించారనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**కాగితాల్లోనే మిల్లింగ్.. ఆచరణలో భారీ గోల్‌మాల్?**

మిల్లింగ్ యంత్రాల సామర్థ్యం తక్కువగా ఉన్నప్పటికీ, మిల్లు కెపాసిటీని క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే ధాన్యం కేటాయించడంలో అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యంగా పౌర సరఫరాల శాఖకు అప్పగించకుండా, బహిరంగ మార్కెట్లో విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మిల్లులో ధాన్యం బస్తాలు గానీ, బియ్యం నిల్వలు గానీ కనిపించకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఆ ధాన్యం ఏమైంది? నిధులు ఎవరి ఖాతాల్లోకి వెళ్లాయి?అగ్గిపెట్టె లాంటి చిన్న రేకుల షెడ్డుకు కోట్ల రూపాయల ధాన్యాన్ని కేటాయించడం వెనుక భారీ స్థాయిలో కమిషన్లు చేతులు మారాయనే చర్చ నడుస్తోంది. అధికార యంత్రాంగం, మిల్లు యాజమాన్యం కుమ్మక్కై ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేశారని స్థానికులు మండిపడుతున్నారు. అసలు ప్రభుత్వ ధాన్యాన్ని ఎక్కడికి తరలించారు? దాని ద్వారా వచ్చిన కోట్ల రూపాయల సొమ్ము ఎవరెవరి బ్యాంక్ అకౌంట్లలో పడింది? అనే అంశాలపై తక్షణమే ఫోరెన్సిక్ మరియు ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ 'పవనసుతా రైస్ మిల్లు' కేటాయింపులు, నిధుల మళ్లింపుపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపి, అక్రమాలకు సహకరించిన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయడంతో పాటు, పక్కదారి పట్టిన సొమ్మును రికవరీ చేయాలని మంథని నియోజకవర్గ ప్రజలు తీవ్రస్థాయిలో డిమాండ్ చేస్తున్నారు.

# వర్ధన్నపేట ఎమ్మెల్యే మాటలు నీటి మూటలేనా?

- మాటలు తూటాల్లా ఉన్న ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయి అంటున్న స్థానికులు,ప్రతిపక్ష పార్టీలు
- వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో 40 ఎకరాలకు పైచిలుకు ప్రభుత్వ భూమిని గుర్తించిన అధికారులు
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు భూమి పూజ చేసింది ఓచోట తరలించింది మరో చోటుకు
- ఎమ్మెల్యే అనుచరులకు వ్యక్తిగత లాభాల కోసమే ఈ తరలింపులు అంటున్న ప్రతిపక్ష నేతలు
- మున్సిఫ్ కోర్ట్ ,వంద పడకల ఆసుపత్రి, సబ్ జైలు నిర్మాణాలకు సైతం ఆ నలభై ఎకరాల కేటాయింపు
- మరోవైపు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ ఆసుపత్రి పై కోర్టులో జరుగుతున్న విచారణ
- వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధి ఎటువైపు వెళుతుందో అర్థం కావట్లేదు అంటూ తర్జన భర్జన అవుతున్న స్థానికులు..





**ప్రజా వాయిస్ వరంగల్ బ్యూరో:** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే. ఆర్ నాగరాజు ( విశ్రాంత పోలీస్ అధికారి) నియోజక వర్గ అభివృద్ధి పై మాటలు తూటాల్లా పేలుతున్న అభివృద్ధి మాత్రం ఆమడదూరంలో ఉందట బహిర్గతంగా చర్చించుకుంటున్నారు స్థానిక ప్రజలు మరియు ప్రతిపక్ష పార్టీల నాయకులు. వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎలక్షన్ల సమయంలో ఇచ్చిన హామీలు పట్టణంకేంద్రాన్ని అభివృద్ధి చేసే అంశాలే అయినా..వాటిని పట్టణ కేంద్రంలో కాకుండా దూర ప్రాంతానికి చేరవేయడంలో కొంత మంది ఎమ్మెల్యే అనుచరులు తప్పుడు సూచనలతో నియోజక వర్గ కేంద్రానికి దూర ప్రాంతాల్లో తరలిస్తున్నట్లు సమాచారం..

**ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఊసే లేదు..**

వంద పడకల హాస్పత్రికి పై ధ్యాసే లేదు..వర్ధన్నపేటలో మున్సిపాలిటీ ఎలక్షన్ సమయంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మరియు ముప్పై పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా గ్రేటింగ్ చేసి ఎలక్షన్లలో మున్సిపల్ అధిష్టానం కైవసం చేసుకున్నారు. ఐతే గెలిచిన నాటి నుండి నేటి వరకు కాలాయపనలతో అక్కడ కడుదామా ఇక్కడకదామ అని హడావిడే తప్ప ఒక్క ఇటుక పెద్ద ఎక్కడకూడా పేర్చలేదనీ బహిర్గతంగా చర్చించుకుంటున్నారు స్థానికులు. ఎలక్షన్ సమయంలో ఇచ్చిన మాటలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో ఆయన మాటలు తూటాలే తప్ప..అభివృద్ధి చేయడంలో మాత్రం నీటి మూటలే అన్నంత చందంగా ఉన్నాయంటూ ఎమ్మెల్యేపై స్థానికులు మరియు ప్రతిపక్ష నాయకులు సెటైర్లు వేస్తున్నారు..ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణంకోసం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని గువ్వల గూడు అనే ప్రదేశంలో దాదాపు ఎకరాలను గుర్తించామని చెప్పు కొచ్చిన కొంతమంది కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతో (లబ్ధి కొరకై) వారికి అనుగుణంగా ఎమ్మెల్యే ఉప్పరపల్లి క్రాస్ వద్ద ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తున్నారని స్థానికులు ,ఇచ్చిన హామీకి కట్టుబడి లేకుండా ఎమ్మెల్యే పట్టణ అభివృద్ధికి తోడ్పడకుండా ఆయన అనుచరుల కు అనుగుణంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్యే తీరుపై మండిపడుతున్నారు..

**40 ఎకరాలకు పై చిలుకు ప్రభుత్వ భూమిని గుర్తించారు..మళ్ళీ ఈ తరలింపులెందుకు..??**

వర్ధన్నపేట నియోజక వర్గానికి 2024 ఎలక్షన్ల సమయంలో కే.ఆర్ నాగరాజు సిపి గా పదవి విరమణ చేసిన తర్వాత గడిచిన మూడు నెలల్లోనే వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను మరచి గెలిచాక మాట తప్పారని స్థానికులు దుయ్యబట్టారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల ,100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, సబ్ జైలు, మున్సిఫ్ కోర్టు నిర్మాణాలకు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని గువ్వల పటోడు వద్ద దాదాపు 45 ఎకరాలను ప్రభుత్వ అధికారులు గుర్తించారు. ఐతే ఇక్కడ నిర్మాణాల కోసం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు. భూమి పూజ చేసిన చోట ప్రభుత్వ నిర్మాణాలను నిర్మించకుండా ఎమ్మెల్యే తన అనుచరుల సలహాలతో వారి వారి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అభి వృద్ధి చెందేందుకు దిశగా వారికి నచ్చిన ప్రదేశాలలో ప్రభుత్వ భూమిని గుర్తించి పట్టణ కేంద్రంలో కాకుండా ఇతర దూర ప్రాంతంలో నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు స్థానికు లు. అంతే కాకుండా హాస్పిటల్ నిర్మాణం కోసమే దేవదాయ శాఖ భూమిని కేటాయించడంతో వంద పడకల ఆసుపత్రి పై కోర్టులో విచారణ కొనసాగుతుంది.దీంతో పట్టణ కేంద్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరి. అయినప్పటికీ కూడా వాటిని విచ్ఛిన్నం చేస్తూ పట్టణానికి సదురా ప్రాంతాలలో నిర్మించి పట్టణ అభివృద్ధిని వెనుక జలో ఉంచుతున్నారని ప్రతిపక్ష నాయకులు సైతం మండిపడుతున్నారు.. ఏది ఏమైనా స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కార్యాలయాలు కూడా స్థానిక కేంద్రంగానే ఉండాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఇప్పటికైనా సొంత ఆలోచనలతో కాకుండా పట్టణ అభివృద్ధికి తోడ్పడే మేధావి వర్గాలతో చర్చించి సరైన నిర్ణయాలు తీసుకొని వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు..

**వంద పడకల ఆసుపత్రి పై వీడని ఉత్కంఠ...**

వర్ధన్నపేటలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఎండోమెంట్ భూమి కేటాయింపుపై హైకోర్టు అనుమతి అవసరం. వర్ధన్నపేటలో 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణం కోసం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయానికి చెందిన ఎండోమెంట్ భూమిని కేటాయించాలన్న ప్రతిపాదనపై ఎండోమెంట్స్ శాఖ స్పందించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం 33 ఏళ్ల లీజుకు ఎండోమెంట్ భూమిని కేటాయించే అవకాశం లేదని స్పష్టం చేసింది.అదే సమయంలో, సంబంధిత భూమిపై హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి మధ్యంతర స్టే ఉత్తర్వులు అమల్లో ఉన్నందున, భూమి కేటాయింపునకు ముందు జిల్లా కలెక్టర్, ఎండోమెంట్స్ శాఖ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి అనుమతి పొందాల్సి ఉంటుందని ఎండోమెంట్స్ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు ఐఏఎస్ వెల్లడించారు. దీంతో వర్ధన్నపేటలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ ప్రక్రియలో తదుపరి చర్యలు హైకోర్టు అనుమతిపై ఆధారపడనున్నాయి.

## రేగా కాంతారావు అరెస్ట్ ఎవరికి మేలు?

- అరెస్ట్ తో పెరిగిన రాజకీయ వేడి
- కేసు కొట్టివేతతో మరింత ఆసక్తికరంగా మారిన రాజకీయ పరిణామాలు
- పినపాకలో రేగాకు పెరుగుతున్న సానుభూతి పై చర్చ
- రాబోయే ఎన్నికల్లో ప్రభావం చూపుతుందా?

**ప్రజా వాయిస్ బూర్గంపాడు** మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రేగా కాంతారావు అరెస్ట్, ఆ తర్వాత ఆయనపై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేయడం ఇప్పుడు పినపాక నియోజకవర్గ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కొద్దిరోజుల క్రితం వరకు కేసు, అరెస్ట్ చుట్టూ సాగిన చర్చ ఇప్పుడు రాజకీయంగా ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అనే దిశగా మారింది. ముఖ్యంగా పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ఈ పరిణామాలు రాజకీయంగా కలిసి వస్తాయా? అనే ప్రశ్న నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.రేగా కాంతారావుపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఓ యువతి చేసిన ఫిర్యాదు ఆధారంగా లైంగిక వేధింపులకు సంబంధించిన కేసు నమోదైంది. అనంతరం తనపై నమోదైన కేసును సవాల్ చేస్తూ రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.అరెస్ట్ వార్తతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ముఖ్యంగా పినపాక నియోజకవర్గంలో చర్చ మొదలైంది. అయితే ఆ చర్చకు మరింత బలం చేకూర్చేలా ఆగస్టు 19న తెలంగాణ హైకోర్టు రేగా కాంతారావుపై నమోదైన కేసును కొట్టివేసినట్లు పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం హైకోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

### అరెస్ట్ తో సానుభూతి పెరిగిందా?...

రాజకీయాల్లో ఒక నాయకుడిపై కేసు నమోదు కావడం, అరెస్ట్ కావడం సాధారణ రాజకీయ విమర్శలకు భిన్నంగా ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ముఖ్యంగా కొద్దికాలానికే న్యాయస్థానం నుంచి ఊరట లభిస్తే ఆ పరిణామం నాయకుడి రాజకీయ ఇమేజ్ పై ఎలా ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికర అంశంగా మారుతుంది.రేగా కాంతారావు విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందన్న చర్చ పినపాకలో వినిపిస్తోంది. అరెస్ట్ సమయంలో ఆయనకు వ్యతిరేకంగా వచ్చిన చర్చ ఒక వైపు ఉంటే కేసు కొట్టివేత తర్వాత ఆయనకు మద్దతుగా, సానుభూతిగా మాట్లాడుతున్న వర్గాలు మరోవైపు కనిపిస్తున్నాయనే రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.అయితే ఇది వాస్తవంగా ఎంత మేరకు ఓటర్లపై ప్రభావం చూపుతుందనేది ఇప్పుడే తేల్చడం సాధ్యం కాదు. రాజకీయంగా సానుభూతి ఓట్లుగా మారాలంటే కేవలం ఒక కేసు పరిణామం సరిపోదు. స్థానికంగా పార్టీ పరిస్థితి, నాయకుడి ప్రజా సంబంధాలు, కార్యకర్తల బలం, ప్రత్యర్థుల వ్యూహాలు, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అనేక అంశాలు కీలకం కానున్నాయి.

### రాబోయే ఎన్నికల్లో రేగాకు కలిసొస్తుందా?.

..రాబోయే ఎన్నికల నేపథ్యంలో రేగా కాంతారావు రాజకీయ భవిష్యత్తుపై ఈ పరిణామం ప్రభావం చూపే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. గతంలో పినపాక నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన రేగా ప్రస్తుతం ప్రతిపక్ష రాజకీయాల్లో చురుకుగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. జూలైలో కూడా సీతారామ ప్రాజెక్టు అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు వార్తలు వచ్చాయి.ఇలాంటి సమయంలో అరెస్ట్ ఆపై కేసు కొట్టివేత అనే వరుస పరిణామాలు ఆయనకు మళ్లీ రాజకీయంగా ఫోకస్ తీసుకువచ్చాయి. ఒకవైపు ప్రత్యర్థులు ఈ అంశాన్ని తమకు అనుకూలంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేయవచ్చు. మరోవైపు రేగా అనుచరులు మాత్రం అరెస్ట్, కేసు పరిణామాలను ఆయనపై రాజకీయంగా జరిగిన దాడిగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది.

### ప్రత్యర్థులకు ఆయుధమా.. రేగాకు అస్త్రమా?...

ఇదే ఇప్పుడు పినపాక రాజకీయాల్లో అసలు ప్రశ్నగా మారింది. కేసు నమోదైన సమయంలో ప్రత్యర్థి రాజకీయ శిబిరాలకు విమర్శలకు అవకాశం లభించింది. కానీ కేసు కొట్టివేతతో రేగా వర్గానికి తమ నాయకుడిపై వచ్చిన ఆరోపణలను రాజకీయంగా తిప్పికొట్టేందుకు అవకాశం లభించినట్టయింది.అయితే హైకోర్టు కేసును కొట్టివేసిందనే అంశాన్ని రాజకీయంగా 'నిర్దోషిత్వానికి తుది తీర్పు'గా చెప్పడం కంటే, న్యాయస్థానం ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిన పరిణామంగా మాత్రమే చూడటం సముచితం. అందువల్ల ఈ అంశంపై రాజకీయ ప్రచారం ఏ రూపం దాల్చుతుందన్నది కూడా ఆసక్తికరంగా మారింది.




## జాతీయ నాయకుల పై అధికార పార్టీ వివక్షత!?

- ఫ్లెక్సీలు తొలగించడంలో అతిత్యోహం ప్రదర్శిస్తున్న వైనం?
- ఒకరికి ఒక న్యాయం ఒకరికి మరో న్యాయం లా వ్యవహరిస్తున్న యంత్రాంగం!
- పేట నగరంలో కనివిని ఎరగని రీతిలో పక్షపాతం వహిస్తున్న అధికార పార్టీ!
- ఇది ఎక్కడ న్యాయము తెలపాలంటూ నిలదీస్తున్న దళిత సంఘాలు

**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని అధికార పార్టీ కాంగ్రెస్ జాతీయ నాయకులు ఫ్లెక్సీల పై అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అంతేకాకుండా పక్షపాతంగా నడుచుకుంటూ కనీవిని ఎరగని రీతిలో ఆధిపత్యం చాలా ఇస్తున్నారని ఒకరికి ఒక న్యాయం మరొకరికి మరో న్యాయం లాగా మున్సిపల్ అధికారులు సైతం నడుచుకుంటున్నారని విమర్శలు లేకపోలేదు. పట్టణ పరిధిలోని రింగ్ రోడ్డు సెంటర్ నందు ఇప్పటికే సాకలి ఐలమ్మ, సర్దార్ పాపన్న గౌడ్ ,అంబేద్కర్, తెలంగాణ తల్లి, స్వామి వివేకానంద ,ఎన్టీ రామారావు, వైయస్ రాజశేఖర్ రెడ్డి, కొమరం భీమా. ఆంధ్ర నాయకుడైన వంగవీటి రంగ. వంటి విగ్రహాలు ఏర్పాటు చేసి తమ ఉనికిని కాపాడుకుంటున్న వివిధ రకాల వర్గీయులు భారీ స్థాయిలో విగ్రహ అభిష్కరణల తొ పాటు ఫ్లెక్సీలు జెండాలు కులాలకు సంబంధించిన రంగులు తోపాటు కొన్ని రకాల సింబల్స్ లు భారీగా ఏర్పాట్లు చేసి మత ప్రచారం కొనసాగించుకోవడం నగరంలో ఒక సంచలనంగా మారింది. ఒక వర్గానికి చెందిన జాతీయ నాయకుడు సంబంధించిన ఓ ప్రదేశానికి ఆ పార్టీ కి చెందిన రంగులు వల్లలను ఏర్పాటు చేయగా అధికార పార్టీ నాయకులు కొందరు కులాల ప్రధాన నాయకుల రంగుల వల్లను తొలగించకుండా కేవలం జాతీయ పార్టీ నాయకుడు ఫ్లెక్సీలను మాత్రమే తొలగించడం పట్టణంలో సంచలనం సృష్టిస్తుంది. ఇప్పటికే కులమత బేధం అనే తేడా లేకుండా ఎంతోమందికి ఉన్నత విద్యను అందించిన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న రింగ్ రోడ్డు నందు అమర జీవుల మరియు దివంగుల నాయకులు విగ్రహాలను ఏర్పాటు చేసి పాఠశాల విద్యార్థులకు ఫలానా కులం చెందిన విగ్రహం వీరుడుదని గుర్తు చేసే విధంగా నాయకులు నడుచుకుంటున్న సందర్భంలో బడుగు బలహీన వర్గానికి చెందిన జాతీయ నాయకుడైన బాబు జగజీవన్ రావు విగ్రహానికి అన్ని ఆటంకులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓ జాతీయ నాయకుడుకు కనీసం గౌరవం కూడా ఇవ్వలేని పరిస్థితిలో అధికార పార్టీ ఉందని ఫ్లెక్సీలు తొలగించడంలో ప్రధాన పాత్ర వహిస్తుందని ఇటువంటి విధానాన్ని మానుకోవాలని దళిత సంఘాలు సైతం హెచ్చరించడం ఒక సంచలనమే! అశ్వారావుపేట పట్టణం పరిధిలోని రింగురోడ్డు సమీపంలో ఏర్పాటు చేసుకున్న విగ్రహాల ఆవిష్కరణలకు ఎలాంటి అనుమతులు లేకపోయినప్పటికీ మానవతా దృక్పథంతో కొందరు అనుకూలంగా ఉన్నప్పటికీ పేద బడుగు బలహీన వర్గానికి చెందిన ఆశాజ్యోతి నాయకుడు విగ్రహానికి ఎందుకు ఆటంకాలు ఎదురవుతున్నాయో! తెలియని పరిస్థితిలో ఉందని ఇటువంటి ఫ్లెక్సీలను తొలగించడం వెనక రాజకీయ కుట్ర లేక కులవ్యక్షత అంటూ దళిత సంఘాలు సైతం తీవ్రంగా విమర్శిస్తున్నాయి ఇప్పటికైనా అధికార పార్టీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు బాబు జగజీవన్ రావ్ విగ్రహానికి మున్సిపల్ శాఖకు సంబంధించిన యంత్రాంగం స్పందించి సహకరించే విధంగా కృషి చేయాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని దళిత సంఘాలు హెచ్చరిస్తున్నాయి. దీనిపై రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో వేచి చూడాలి మరి!



## హమాలి కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- తహసిల్దార్ కార్యాలయం ఎదుట హమాలి కార్మికుల ధర్నా
- ఉద్యోగ భద్రత సామాజిక భద్రత ఆరోగ్య సదుపాయాలు ప్రమాద బీమా సదుపాయాలు కల్పించాలి
- ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు

**ప్రజా వాయిస్ /రఘునాథపల్లి** (జనగామ జిల్లా)హమాలి కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ (CITU) ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వివిధ డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ కు యూనియన్ నేతలు అందజేశారుఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆల్ అమాలి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా వేలాది మంది హమాలి కార్మికులు మార్కెట్లు, గోదాములు, రైస్ మిల్లులు, కూరగాయల మార్కెట్లు తదితర రంగాల్లో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారు. అయితే వారికి ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఆరోగ్య సదుపాయాలు, ప్రమాద బీమా వంటి కనీస సంక్షేమ సదుపాయాలు అందడం లేదు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలి కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారుకాబట్టి ప్రభుత్వం వెంటనే హమాలి కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, పెన్షన్, ప్రమాద బీమా, ఆరోగ్య సదుపాయాలు, పిల్లల విద్యకు సహాయం, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.హమాలి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి జిల్లాలో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న హమాలి కార్మికులందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.ఈ ధర్నా కార్యక్రమంలోఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు బైరగోని బాలరాజు జిల్లా మండల నాయకులు మహాలక్ష్మి గోదాం నాయకులు కొంగరి నరసయ్య పెండేల శ్రీనివాస్ ఎండి దస్తగిరి మద్దూరి యాదగిరి శాడ వెంకటయ్య దండు రాజు కౌడగాని కుమార్ దొర గొల్ల గట్టయ్య కాటబుచ్చయ్య దేవర హరిబాబు ఆరూరి సురేష్ కంచె కుమార్ పాల్గొన్నారు

## ప్రభుత్వ కళాశాల విద్యుత్‌తో ప్రిన్సిపాల్ కారు ఛార్జింగ్..!

- కళాశాలలో విద్యుత్ వినియోగం ప్రిన్సిపల్ ఇష్టారాజ్యమా..!!

**ప్రజా వాయిస్ టేక్మాల్ :** టేక్మాల్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ తన వ్యక్తిగత కారును ఛార్జింగ్ చేసుకునేందుకు కళాశాలకు సంబంధించిన విద్యుత్‌ను వినియోగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న విద్యాసంస్థలో విద్యుత్‌ను విద్యార్థులు, కళాశాల అవసరాల కోసం వినియోగించాల్సి ఉండగా, వ్యక్తిగత వాహనం కోసం వినియోగించడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలా విద్యుత్‌ను వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తే ఆ ఖర్చు ప్రభుత్వ ఖాతాపై పడే అవకాశం ఉందని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్‌ను వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.అధికారులు స్పందించి కళాశాల విద్యుత్ వినియోగంపై తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా వినియోగం జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.పై విషయమై కళాశాల ప్రిన్సిపల్ సుభాష్ చంద్ర ను వివరణ కోరగా చార్జింగ్ పెట్టకూడదు కానీ అత్యవసర పరిస్థితుల్లో పెట్టుకుంటానంటూ సమాధానం ఇచ్చారు.



## చదువుకునే చోట గంజాయి ముఠా సంచారం!

- తాండూరులో 1260 గ్రాముల గంజాయి స్వాధీనం
- ముగ్గురు అరెస్ట్

**ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** చదువుకునే చోట గంజాయి ముఠా సంచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.ఈ క్రమంలో తాండూరులోని విలియం మూన్ స్కూల్ గ్రౌండ్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా బ్యాగులతో తిరుగుతుండటాన్ని పోలీసులు గమనించారు. అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని వారి బ్యాగులను తనిఖీ చేయగా, వారి వద్ద 1,260 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు.దీంతో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై సంబంధిత ఎన్ డి పి ఎస్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, అరెస్ట్ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.ఈ తనిఖీలు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, వారి బృందం, తాండూర్ టౌన్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.



# కాగజ్‌నగర్-దహెగాం రహదారి పనుల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ నిరసన

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** దహెగాం మండలంలో కాగజ్‌నగర్–దహెగాం ప్రధాన రహదారి పనుల్లో నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. కొత్మీర్ నుండి పెసరగుంట వరకు రహదారి బురదమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు నిరసన చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు.2023లో కొత్మీర్ నుండి దహెగాం వరకు డబుల్ రోడ్డు మంజూరైనా ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిర్లక్ష్యం వల్ల పనులు పూర్తి కావడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వారం రోజుల్లోగా రహదారి పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంభగౌని సులోచన సంతోష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు





# రూపా రెడ్డి హత్యకు నిరసనగా ట్రస్మా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**ప్రజా వాయిస్/ అనుమల:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్న ప్రిన్సిపల్ రూపా రెడ్డి హత్యకు నిరసనగా అనుముల మండల ప్రైవేట్ పాఠశాలలు (ట్రస్మా)ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆమె మృతికి సంతాపం తెలిపారు.శుక్రవారం ప్రైవేట్ పాఠశాల బంద్ కు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల మండల అధ్యక్షుడు తడకమల్ల శ్రీనివాస్,పాఠశాల డైరెక్టర్ లు నిమ్మల లక్ష్మారెడ్డి, నరేందర్ రెడ్డి,భాస్కర్ రెడ్డి,కుకడాల ఆంజనేయులు ఉపాధ్యాయులు గోపి నాయర్ ఎడవల్లి రాంబాబు,సతీష్ ,ప్రభూ విజయ్ శ్రీధర్ రెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచుల సమస్యలపై వినతి

- ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి
- సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు భూమన్న

**ప్రజావాయిస్/మోమిన్ పేట్:** రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్ కమిషనర్, గ్రామీణ ఉపాధి హామీ పథకం సీఈవో డి. దివ్య, ఐఏఎస్‌ను సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు కలిసి సర్పంచులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు.సర్పంచుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు భూమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

# జీఓ 97ను పునఃసమీక్షించాలి

- బీజేపీ అసెంబ్లీ కో ఆర్డినేటర్ వడ్ల నందు
- వికారాబాద్ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన ర్యాలీ

**ప్రజావాయిస్/వికారాబాద్:** జీవో 97ను పున సమీక్షించాలని బిజెపి అసెంబ్లీ కోఆర్డినేటర్, దిశా కమిటీ మెంబర్ వడ్ల నందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చౌరస్తా వద్ద విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమంలో వడ్ల నందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీవో నంబరు 97 పై విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ డిప్లొమా విద్యకు ఉన్న ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తూ, విద్యార్థులకు ఉన్నత విద్యలో ముందుకు వెళ్లే అవకాశాలను కాపాడాలని అన్నారు.ప్రత్యేకంగా డిప్లొమా తర్వాత ఈసెట్ ద్వారా బీటెక్ లో ల్యాటరల్ ఎంట్రీ పొందే అవకాశాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి యువ నాయకులు, ఆయా పార్టీల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.







# ఓటును కాపాడుకోవాలి.. ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి

- మిర్యాలగూడలో 50 వేల ఓట్లు పోయే ప్రమాదం
- కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి పార్టీకి కార్యకర్తలే నిజమైన బలం
- కష్టపడిన వారికి సముచిత న్యాయం చేస్తాం
- కార్యకర్తలను పట్టించుకోవడం లేదంటూ మండల అధ్యక్షుడి ఆవేదన
- ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు
- బీఎల్ ఏలకు కృతజ్ఞత సభ.
- హాజరైన ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత.

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ:** కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, ప్రతి ఓటును కాపాడుకుంటూ పార్టీని, ప్రజా ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ భవన్, హౌసింగ్ బోర్డు ఎస్పీ కన్వెన్షన్‌లో మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలతో పాటు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బీఎల్ఏలకు కృతజ్ఞత సభ నిర్వహించారు.

### రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం. ఎమ్మెల్యే బత్తుల.

ముందుగా రాజీవ్ భవన్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ కన్వెన్షన్‌లో కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఆధునిక, సాంకేతిక దేశంగా తీర్చిదిద్దడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. యువతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కంప్యూటర్, టెలికమ్యూనికేషన్, విద్యా రంగాల్లో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు నేటి భారతదేశానికి బలమైన పునాదులు వేశాయని పేర్కొన్నారు.

### 50 వేల ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, ఎస్ఐఆర్ నల్గొండ పార్లమెంట్ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. రైతు భరోసా, రైతు బీమా, మహిళలకు వడ్డీలేని రుణాలు వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు.ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే దాదాపు 30 వేల ఓట్లు అనమాలీస్‌గా గుర్తించబడి, 13 కారణాలతో ఎన్నికల కమిషన్ తొలగించిందని తెలిపారు. మిర్యాలగూడలో చనిపోయిన వారి ఓట్లను కూడా కలిపితే దాదాపు 50 వేల ఓట్లు పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క ఓటు కూడా చేజారకుండా కాపాడుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు."మనం కూర్చున్న పడవకు పక్కోడు వచ్చి బొక్క పెడితే మనం మునుగుతాం.. మన ప్రభుత్వం కూడా మునుగుతుంది" అంటూ బల్మూరి వెంకట్ కార్యకర్తలను హెచ్చరించారు. ప్రభుత్వం, పార్టీపై వచ్చే చిన్నచిన్న విమర్శలను పట్టించుకోకుండా ప్రజల్లోకి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు.

### కాంగ్రెస్ కు కార్యకర్తలే నిజమైన బలం డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత.

డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి ఆధునిక భారత అభివృద్ధి వరకు కాంగ్రెస్‌దే ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ సాంకేతిక రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, యువతకు అవకాశాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు దేశ ప్రగతికి దోహదపడ్డాయని తెలిపారు.రైల్వేలు, విద్యుత్, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాలే పునాదులు వేశాయని అన్నారు. బీజేపీకి స్వాతంత్ర్య పోరాటంతో ఎలాంటి సంబంధం లేదని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పున్న కైలాస్ నేత స్పష్టం చేశారు. కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు త్వరలోనే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని తెలిపారు. యువత, మహిళలు, బలహీన వర్గాలకు రాజకీయాల్లో మరింత భాగస్వామ్యం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

### కార్యకర్తలను పట్టించుకోవడం లేదు.. మండల పార్టీ అధ్యక్షులు గుండు నరేందర్.

అయితే ఇదే కార్యక్రమంలో మిర్యాలగూడ మండల పార్టీ అధ్యక్షుడు గుండు నరేందర్ కార్యకర్తల సమస్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలను నాయకత్వం పట్టించుకోవడం లేదని, వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు.కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని ఆయన కోరారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తల సమస్యలను నాయకత్వం పరిష్కరించి, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

### బీఎల్ ఏలకు కృతజ్ఞతలు

అనంతరం ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మిర్యాలగూడ నియోజకవర్గ బీఎల్ఏలకు కృతజ్ఞత సభ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు చేసిన కృషి, సమన్వయం, అంకితభావం అభినందనీయమని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. పార్టీv సంస్థాగత బలోపేతంలో ప్రతి కార్యకర్త, ప్రతి బీఎల్ఏ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ప్రజలకు–పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తున్న బీఎల్ఏల సేవలను గుర్తించి తగిన ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత, పార్లమెంట్ కోఆర్డినేటర్ కస్ప శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మండల, టౌన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, ఇన్‌చార్జులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# శంకరంపేట అభివృద్ధికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి శ్రీకారం

- రూ.30 లక్షలతో ధాన్య గోదాం.. రూ.10 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ
- సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన
- రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** నారాయణఖేడ్ నియోజకవర్గంలో గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శంకరంపేట(ఎ) మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేయడంతో పాటు రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

### రూ.30 లక్షలతో ధాన్య గోదాం

బూరుగుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆహార ధాన్యాల నిల్వ గోదాం పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. అంతకుముందు గ్రామంలోని శ్రీ కోటమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని భద్రంగా నిల్వ చేసుకునేందుకు గోదాం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వర్షాలు, ఇతర ప్రతికూల పరిస్థితుల్లో ధాన్యం దెబ్బతినకుండా రక్షణ లభిస్తుందని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

### పాఠశాల ప్రహరీ గోడకు శంకుస్థాపన

మక్తా లక్ష్మాపూర్ గ్రామంలో రూ.10 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, పాఠశాల ఆస్తుల పరిరక్షణకు ప్రహరీ గోడలు అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

### సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శ్రీకారం

శంకరంపేట మండల కేంద్రంలోని పలు వార్డులు, వీధుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని తెలిపారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

### రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో నివాళులు

శంకరంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక యుగం వైపు నడిపించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. టెలికాం, కంప్యూటర్, సమాచార సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన నాంది పలికారన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో భాగస్వాములను చేసిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొండా సుస్మిత వ్యాఖ్యలకు నిరసనగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచ రాములు 48 గంటల నిరాహార దీక్ష

- బీసీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్న మంత్రి కొండ సురేఖ
- కొండ సురేఖ కొండ మురళి ఎన్ని పార్టీలు మారారో ఒకసారి గుర్తు చేసుకోవాలి
- జనగామ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచరాములు

**ప్రజా వాయిస్/జనగామ జిల్లా ప్రతినిధి** నిన్న పరకాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ, కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచ రాములు 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా కంచ రాములు మాట్లాడుతూ.. బీసీలపై



కపట ప్రేమను ప్రదర్శిస్తున్న మంత్రి కొండా సురేఖ, గతంలో కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ పదవిని రెడ్డి సామాజిక వర్గానికి ఎందుకు కట్టబెట్టారని ప్రశ్నించారు.తనపై కేసులు ఉన్నాయనే కారణంతో తనకు పదవి ఇవ్వలేదని చెబుతున్న కొండా సురేఖ, కొండా మురళిపై కేసులు ఉన్నప్పటికీ ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' అంటూ ఆరోపణలు చేస్తున్న వారు, గతంలో కొండా సురేఖ, కొండా మురళి ఎన్ని పార్టీలు మారారో ఒకసారి గుర్తు చేసుకోవాలని కంచ రాములు అన్నారు.ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు తన నిరసన కొనసాగుతుందని కంచ రాములు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ మరియు మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోక్కుంట్ల ప్రవీణ్,కౌన్సిలర్ పాముకుంట్ల ప్రసాద్ గౌడ్,సీనియర్ నాయకులు చింతకింది మల్లేష్, జాయ మల్లేష్, మేకల సమ్మయ్య,నోముల సోమయ్య,గోరిగే రవి కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ మొగిలి బిక్షపతి పి ఎస్ ఎస్ డైరెక్టర్ కంచంపల్లి గవ్వల బిక్షపతి కొలుపుల యాదగిరి రమేష్ శ్రీనివాస్ కిష్టయ్య



# దర్యాప్తులో నాణ్యత పెంచాలి

- పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి
- దేవరకొండ డీఎస్పీ, డిండి సీఐ కార్యాలయాలను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**ప్రజా వాయిస్,నల్లగొండ.** కేసుల దర్యాప్తులో నాణ్యత పెంచడంతో పాటు పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం దేవరకొండ డీఎస్పీ కార్యాలయం, డిండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులు, క్రైమ్ ఫైల్స్, పెండింగ్ కేసుల వివరాలు, పరిపాలనా రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, దొంగతనాలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ప్రతి కేసులో దర్యాప్తు ఏ దశలో ఉందో, సేకరించిన ఆధారాలు, నిందితుల అరెస్టు, చార్జ్‌షీట్ దాఖలు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంఘటనా స్థలం నుంచి ఆధారాలను శాస్త్రీయంగా సేకరించి, కోర్టులో నేరం రుజువయ్యేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో కేసుల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సమస్యాత్మక, నేర ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. నేరాలు జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా ముందస్తు చర్యల ద్వారా నేరాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగేలా అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డిండి సీఐ బిసన్నతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువు ఎఫ్‌టీఎల్‌లో చేపల చెరువులా?

- హద్దులు తేల్చకుండానే సాగుతున్న ఆక్రమణల పర్వం?
- కలెక్టర్ కు కన్సాన్ పల్లి యువకుల ఫిర్యాదు
- సంయుక్త సర్వేతో వాస్తవాలు వెలికితీయాలని డిమాండ్

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** ఇటీవల కన్సాన్‌పల్లి పెద్ద చెరువు చర్చనీయాంశంగా మారింది. చెరువు పరిరక్షణపై గ్రామస్తులు ఫిర్యాదుల పర్వం మొదలెట్టారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపల చెరువులు ఏర్పాటు చేయడంతో పాటు మట్టి తవ్వకాలు, కాలువల నిర్మాణం, ప్రైవేట్ చేపల చెరువులకు నీటి తరలింపు జరుగుతున్నాయంటూ కన్సాన్‌పల్లి గ్రామ యువకులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెరువు అసలు హద్దులు, శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిని అధికారికంగా తేల్చి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు గ్రామస్తులు గురువారం వినతిపత్రం అందజేశారు.మూడు గ్రామాలకు ఆధారమైన పెద్ద చెరువుకన్సాన్‌పల్లి పెద్ద చెరువు ఆందోల్ మండలంలోని కన్సాన్‌పల్లి, శేరిమల్లారెడ్డిపల్లి, అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్, వట్టిపల్లి మండలంలోని బిజిలీపూర్ బుడ్డాయిపల్లి, కేరూర్ గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ చెరువు కన్సాన్ పల్లి, శేరిమల్లారెడ్డి పల్లి, రాంసాన్ పల్లి గ్రామాల వ్యవసాయానికి కీలక నీటి వనరుగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. చెరువు విస్తీర్ణం, హద్దులు స్పష్టంగా లేకపోవడం భవిష్యత్‌లో ఆక్రమణలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఎఫ్ టీఎల్ లో ఏం జరుగుతోంది?

ఇటీవల చెరువు పరిధిలో మట్టి తవ్వకాలు, కాలువల నిర్మాణం, ప్రైవేట్ చేపల చెరువులకు నీటి తరలింపు వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో అసలు చెరువు శిఖం ఎంత? ఎఫ్‌టీఎల్ ఎక్కడి వరకు ఉంది? ఏ సర్వే నంబర్లు చెరువు పరిధిలోకి వస్తాయి?



అనే అంశాలపై స్పష్టత అవసరమని యువకులు కోరుతున్నారు. అధికారిక రికార్డుల ఆధారంగా హద్దులను గుర్తించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.పాత రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డులు, మ్యాపులు, సర్వే నంబర్లను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని యువకులు కోరారు. కేవలం రికార్డుల పరిశీలనతో కాకుండా చెరువు చుట్టూ జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు.

## నీటి తరలింపుపైనా విచారణ

చెరువు నుంచి ప్రైవేట్ చేపల చెరువులకు నీటిని తరలించేందుకు అనుమతులు ఉన్నాయా? కాలువలు, మోటార్ల ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సంయుక్త బృందంతో సర్వే చేయాలి

రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేసి తక్షణమే క్షేత్రస్థాయి సర్వే, స్థల పరిశీలన చేపట్టాలని యువకులు కోరారు. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, సర్వే హద్దులను గుర్తించి శాశ్వతంగా హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

## చెరువు భూములకు రక్షణ ఎప్పుడో?

భవిష్యత్‌లో ఆక్రమణలకు అవకాశం లేకుండా చెరువు పరిధిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామ యువకులు కోరారు. చెరువు హద్దులను ప్రజలకు స్పష్టంగా తెలియజేసి, ఎఫ్‌టీఎల్ పరిధిలోని చేపల చెరువులు, నిర్మాణాలు, మట్టి తవ్వకాలు, కాలువలను సమగ్రంగా పరిశీలించి చెరువు భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంయుక్త సర్వే నిర్వహిస్తారా? చెరువు హద్దులు, ఎఫ్‌టీఎల్‌పై స్పష్టత ఇస్తారా? అన్నది వేచి చూడాలి.

# మరణాన్ని రాజకీయం చేస్తున్న బిఆర్ఎస్

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని రాజకీయంగా వాడుకోవద్దు
- టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి



**ప్రజా వాయిస్, వరంగల్ నెక్కొండ;** గత వారం పది రోజులుగా నర్సంపేట నియోజకవర్గంలో దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని రాజకీయంగా వాడుకుంటూ, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని రాజకీయంగా బద్నాం చేసి లబ్ది పొందాలని కొంతమంది బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని నర్సంపేట టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు. అలాగే నిజంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకత్వానికి పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబంపై చిత్తశుద్ధితో కూడిన ప్రేమ, గౌరవం ఉంటే, ఆయన మరణించిన వెంటనే వచ్చిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ముఖ్యమంత్రి ఇతర రాష్ట్ర నాయకులు కుటుంబాన్ని పరామర్శించిన సమయంలోనే భవిష్యత్ రాజకీయ భరోసాపై స్పష్టమైన ప్రకటన ఎందుకు చేయలేదని అన్నారు. కేవలం ఒక విషాద ఘటనను రాజకీయంగా ఉపయోగించుకుని కాంగ్రెస్ పార్టీపై, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పై ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ ప్రయోజనం తప్ప మరేమీ లేదని పెద్ది సుదర్శన్ రెడ్డికి అనారోగ్య పరిస్థితి ఏర్పడిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయించి మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ఆయన చేయాల్సిన బాధ్యతను నిర్వర్తించారు.

ఈ విషయాన్ని రాజకీయంగా వక్రీకరించి, కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తీసుకురావాలనే ఉద్దేశంతోనే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు వివాదాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. అలాగే అంతిమయాత్రలో కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించారని ప్రజల్లో చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు, నాయకులు అభిమానులు స్వేచ్ఛగా వచ్చి చివరి చూపు చూసి నివాళులు అర్పించే అవకాశం ఉండేలా చూడాల్సిన సమయంలో, ఒక నిర్దిష్ట రాజకీయ కార్యక్రమంలా వ్యవహరించడం సరికాదని అన్నారు.ఆయన అంత్యక్రియలు జరిగిన రోజు అనేక ఇబ్బందులు, రాజకీయ విమర్శలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఇది ప్రభుత్వం చూపిన గౌరవానికి నిదర్శనం అని అన్నారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం ఒక కుటుంబానికి మాత్రమే కాకుండా నియోజకవర్గ ప్రజలకు కూడా విషాదకరమైన ఘటన ఇలాంటి సమయంలో రాజకీయాలకు అతీతంగా కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి, ఆయన మరణాన్ని రాజకీయంగా ఉపయోగించుకుని ఇతర నాయకులను బద్నాం చేయడం బాధాకరం నర్సంపేట నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు స్థానిక నాయకుల దిష్టిబొమ్మలు దహనం చేసే స్థాయికి రాజకీయాలను తీసుకెళ్లిన సందర్భాలు చాలా అరుదు ప్రస్తుతం కొంతమంది బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న రాజకీయ ప్రేరేపిత కార్యక్రమాలు నియోజకవర్గ రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని పీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పెండ్యాల హరి ప్రసాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు లావుడ్య తిరుమల్ చౌహాన్ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, నెక్కొండ సొసైటీ చైర్మన్, సూరిపల్లి సొసైటీ చైర్మన్ మాదాటి శ్రీనివాస్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదునూరి సాయి కృష్ణ , జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, కొల్లి సుబ్బారెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగం ప్రశాంత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు భాను ప్రకాష్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గై లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి శివ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పందిళ్ల వద్ద ప్రాణసంకటంగా మారిన టోల్‌గేట్, రహదారి పనులు

- అధికారుల తీవ్ర నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**ప్రజా వాయిస్ హుస్నాబాద్,** ఎల్కతుర్తి – సిద్దిపేట జాతీయ రహదారి పై హుస్నాబాద్ మండల పరిధిలోని పందిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న టోల్‌గేట్, రహదారి విస్తరణ పనులు నెలల తరబడి అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర నరక యాతన అనుభవిస్తున్నారు. టోల్‌గేట్ నిర్మాణం పూర్తి కాకపోవడం, ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి వర్షాలకు పూర్తిగా దెబ్బతిని తీవ్ర గుంతలమయంగా మారడంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రాణాపాయంగా మారింది. నిబంధనల ప్రకారం నిర్మాణ సమయంలో నాణ్యమైన ప్రత్యామ్నాయ రహదారిని అందించాల్సి ఉన్నప్పటికీ, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల చిన్నపాటి వర్షానికే రోడ్డంతా చెరువును తలపిస్తూ బురదమయమవుతోంది. పందిళ్ల – హుస్నాబాద్ మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద పనులు సగం మధ్యలోనే నిలిచిపోవడం, అక్కడ బ్రిడ్జి ఎత్తు పెరిగినా కనీస హెచ్చరిక బోర్డులు, కాషన్ లైట్లు, సైన్ బోర్డులు లేదా సేఫ్టీ రేలింగ్స్ వంటి భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ఇక్కడ 3 నుండి 4 తీవ్ర ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటంతో తమ గ్రామానికి 'యాక్సిడెంట్ల స్పాట్'గా చెడ్డపేరు వస్తోందని పందిళ్ల గ్రామ సర్పంచ్ రమేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై నేషనల్ హైవేస్ అథారిటీ (NHAI), ఆర్ అండ్ బి (R&B) అధికారులకు సర్పంచ్ తో పాటు స్థానికులు 4 నుండి 5 సార్లు ఫిర్యాదు చేసినా, ప్రజా వాయిస్ ప్రతినిధి ప్రత్యక్ష ప్రసారంలో ఆర్ అండ్ బి ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేసినా అధికారులు స్పందించకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సమస్యపై తక్షణమే ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులను ఆదేశించి అసంపూర్తిగా ఉన్న టోల్‌గేట్, రహదారి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని, తాత్కాలిక రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి సేఫ్టీ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పారిశుధ్యంపై నిర్లక్ష్యం.. ప్రజలకు అవస్థలు

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్,** మండలంలోని మాచిన్‌పల్లి గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎస్సీ కాలనీల్లో మురుగు కాలువలు కూలిపోయి శిథిలావస్థకు చేరడంతో మురుగునీరు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇళ్ల ముందు, రోడ్ల పక్కన మురుగునీరు నిలిచి ఉండటంతో నిత్యం దుర్వాసనను భరించాల్సి వస్తోందని వాపోతున్నారు.ఇప్పటికే గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించినప్పటికీ వాటికి ఇరువైపులా మట్టి పోయకపోవడంతో వర్షపు నీరు, మురుగునీరు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.గ్రామానికి ఐదేళ్లు సర్పంచిగా పనిచేసి, రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటికీ పారిశుధ్యం, మురుగు కాలువల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కాలువల సమస్యపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి మురుగు కాలువల్లో పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించి, అవసరమైన చోట కాలువలను పునర్నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే సీసీ రోడ్లకు ఇరువైపులా మట్టి పోసి వర్షపు నీరు, మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు చేపట్టి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలన్నారు.



# రామప్ప శిల్పకళా వైభవానికి ఫిదా

- శిక్షణ అధికారుల సందర్శన
- భారత్ దర్శన్ లో భాగంగా పాలంపేటకు వచ్చిన అధికారులు

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా;** వెంకటాపూర్ మండలం:/ ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప దేవాలయాన్ని హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అధికారులు గురువారం సందర్శించారు. భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా పాలంపేటకు చేరుకున్న అధికారులు రామప్ప ఆలయ శిల్పకళా వైభవాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అసిస్టెంట్ పర్యాటక అధికారి కుసుమ సూర్యకిరణ్, పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ రామప్ప ఆలయ చరిత్ర, కాకతీయుల నిర్మాణ నైపుణ్యం, శిల్పకళా విశిష్టతలను వివరించారు. ఆలయ సందర్శన అనంతరం అధికారులు రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. రామప్ప ఆలయ శిల్ప సంపదతో పాటు చెరువు పరిసరాల ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా కుసుమ సూర్యకిరణ్ మాట్లాడుతూ.. రామప్ప దేవాలయం తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. గోరంట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ.. కాకతీయుల అద్భుత శిల్పకళ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, రామప్ప చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఇమ్మడి భాస్కర్, ఎంసిహెచ్ఆర్డీ అధికారులు వెంకటేశ్వర్లు, రవి, ఆర్ఐ రమేష్ తో పాటు పర్యాటక పోలీసులు, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

